పక్కమీదనుండి లేచిన రాజమ్మ మళ్ళీ పక్కమీదే కూల బడి పోయింది.

"మారాజు" ఔతాడనుకున్న కొడుకిలా హృదయంలో చిచ్చు పెట్టి మంటకలిసి పోయేడు.

**(జయశ్రీ, 1.3.1966)**

# నల్లంచు తెల్లచీర

**"చ**చ్చిన శవంలా అలా పడుకోకపోతే కాస్త యాక్టివ్‌గా లేచి కూర్చోరాదూ?" అంది అరుణ యశోదతో మాటలతో పొడుస్తూ.

"ఆవిడగారు చచ్చిన శవం ఎందుకైంది? విరహంలో శకుంతల్లా పోజుపెడితే" పోటు ఎక్కువ చేసింది శారద.

'నా యిష్టం! కావాలంటే ప్రేమలోపడ్డ శకుంతల్లా పాటలు పాడుకుంటా! మీ రెవరు ఆక్షేపించడానికి?" అని తిరగబడింది శవంలాంటి, విరహంలోని శకుంతలా వురఫ్ యశోద.

"కావాలంటే ప్రసవించే శకుంతల్లా పిచ్చి కేకలెయ్యి! ఎవరొద్ద న్నారు?" మరీ రెచ్చగొట్టింది అరుణ.

"ఇందాకట్నించీ చూస్తున్నా, ఎందుకమ్మా ఈ ఒక్క రోజు భాగ్యానికి అలా కరుచుకుంటారు?" సర్దిచెప్పింది రెక్కలూ, ఆలివ్‌కొమ్మా లేని శాంతిదూతలా సుందరం.

సుందరం మాటలకి అంతకుముందు అరగంటై జరుగుతున్న అనధికార యుద్ధం ఆగింది. సుందరానికి తెలుసు– వాళ్ళలా ఎందుకు గొంతు చించుకొంటున్నారో.

వాళ్ళు నలుగురూ ప్రాణస్నేహితులు. నాలుగు వేర్వేరు ఊళ్ళనుండి వచ్చి, మూడేళ్ళు వుమెన్స్ కాలేజీలో చదివి, ది సయామీస్ క్వాడ్రుప్లెట్స్(The Siamese quadruplets) అని పేరు తెచ్చుకుని, ఒకర్నొకరు జీవితంలో విడవకుండా వుందామన్న ఆశ, తమ కళ్ళెదుటే నేటితో పగిలిపోతుందని గ్రహించేక, వాళ్ళ మనసుల నైర్మల్యం కలతపడి, ప్రతి చిన్న విషయానికీ దెబ్బలాడుకో నారంభించేరు. వాళ్ళ పరీక్షలు ఐపోయేయి. అంతా చాలా బాగా రాశేరు. ఒకర్నుంచి ఒకరు దూరమైపోతున్నామన్న బెంగా, యిక బహుశా జీవితంలో కలుసుకోలేమేమోనన్న బాధా వారి హృదయాల్ని ఇనుప చేతుల్తోపిండి చేస్తున్నాయి. వారెవరి మధ్యా ఎటువంటి అరమరికా, భేదం ఎన్నడూలేదు. ఇతరులని ప్రేమించగల సుహృద్భావం, తమ హక్కులు మరిచి పోగల టేక్టు (Tact) మరొక బలహీనతలెడ సానుభూతీ అందరికీ వుండడంవల్ల వారిమధ్య స్నేహం జీవితాంతర బంధంగా నిలిచి పోయింది.

నలుగురూ అందగత్తెలే. నల్ల బ్లాక్ బోర్డుమీద నాలుగు వివిధ రంగుల సుద్దముక్కలతో గీసిన గీతల్లా ఎవరి అందం వారికుంది. నలుగురూ కలుసుకున్న ప్పుడు ప్రతిఒక్కరూ మరీ అందంగా కన్పిస్తారు.

ముగ్గురూ బాగా కలవారి బిడ్డలే. సవతి తల్లులూ, టీ.బీ. అన్నయ్యలూ, పీచురుగొట్టు తండ్రులూ, ఎవరికీ లేరు. జీవితంలోని బాధలు తెలియకుండా, జీవితసాగరంలో అలల మీద నాట్యం చేస్తూ జీవితమంటే ఒక రాకెండ్‌రోల్ పాటగా యింత వరకూ గడిపేశారు.

రేపే ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోవాలి. అంచేత ఆ సాయంత్రం బీచిలో సముద్రాన్ని ఆఖరుసారిగా చూస్తూ కొంతసేపు కూర్చుని, సినిమాకెళ్ళి, హాస్టలికి లేటుగా రావటానికి పూర్తి ముక్కున్న తాటకిలాంటి ఆడవార్డెన్ పెర్మిషను పొంది బైల్దేరబోతూ వుంటే యీవేళ "శకుంతల చీర నాది" అంది యశోద సుందరంతో.

సుందరం అంతకుముందు నెలనాడు నల్లంచు తెల్లనూలు చీర కొనుక్కుంది. కాటుక వాలుకన్నులా, నల్లగీత మబ్బులో యిరుక్కున్న చంద్రుడిలా వున్న ఆ చీర అందరికీ ప్రాణమై పోయింది. మళ్ళీ అలాంటి చీరలు కొనుక్కుందామని మిగతా ముగ్గురూ ప్రయత్నించినా దొరకలేదు. కొన్ననాడే చేత్తోపట్టుకుని ఏదో రాసుకుంటూంటే "అచ్చు శకుంతల్లా వున్నా" వంది సుందరం. నాటినుండి ఆ చీరకి శకుంతల చీరన్న పేరొచ్చీసింది.

❖ ❖ ❖

ఆవేళ ఆచీర కట్టుకుందామని మిగతా ముగ్గురికి బలమైన కోరికవున్నా, యశోదే తనకోరిక ముందు ప్రకటించడం మూలంగా, దాన్ని కట్టుకొనే హక్కు సంపాదించుకొంది.

బీచికి రాగానే యశోద చీర నలక్కుండా పక్కగా తిరిగి పడుకొని ఎడమచేయి మడతపెట్టి, అరచేతికి చెంప ఆనించి,

సముద్రంలోకి దూరంగా చూస్తూవుంటే, వాళ్ళ సంభాషణల్లోకి శవాలూ, శకుంతల్లూ వచ్చేయి.

శాంతి స్థాపించేక సుందరవేఁ మళ్ళీ సంభాషణ ప్రారంభించింది. "యీ డిగ్రీ కోర్సయ్యేక ఏం చేద్దావంటారు?"

"ఎమ్మెస్సీ చదివి అఖిలాంధ్ర ఆడపిల్లల ట్యుటోరియల్ కాలేజీ పెడదాము" అంది యశోద.

"లేకపోతే పెళ్ళిళ్ళు చేసుకుని అఖిలాంధ్ర పిల్లల్తల్లుల కాంపిటేషనైనా సరే" కొత్త దెబ్బలాటకి పునాదులేసింది అరుణ.

"వద్దంటేమాత్రం పెళ్ళాడక తప్పుతుందా?" న్యాయ సమ్మతమైన సందేహం వెలిబుచ్చింది శారద.

"అలాఐతే అదుగో వాడ్ని ఎవరో ఒకరు పెళ్ళాడేయండి" అంది సుందరం, తమవేపు కలల్లో తేలిపోతున్న కవిలా వస్తున్న సుబ్రమణ్యాన్ని చూపిస్తూ. పెళ్ళికాని అసిస్టెంటింజనీరు సుబ్రమణ్యం అంతకు రెండు నెలల ముందే అక్కడకు దగ్గరలో వున్న మరోవూరు పోష్టయ్యేడు.

"మీ రూముకు వెళితే మీరిలావచ్చారని తెలిసొచ్చా" క్షమార్పణ చెప్తుతున్నట్టు అన్నాడు సుబ్రమణ్యం సుందరంతో వాళ్ళ దగ్గర కొచ్చాక.

'అబాద్ధాలాడలేని అసిస్టెంటింజనీరు– కాంక్రీటులో కవిత్వం చెప్పే కవి– మా అన్న" అంటూ పరిచయాలు పూర్తి చేసింది సుందరం.

యశోధ కెదురుగా, సుందరానికి పక్కగా కూర్చున్నాడు సుబ్రమణ్యం. సుబ్రమణ్యంకి ఎవరేనా మాట్లాడితే అడ్డురాకుండా కాశ్మీరు సమస్య కారణాలదగ్గర్నుంచి కరక్కాయ అవుషధ గుణాలవరకూ వినగల ఓర్పూ, ఎవరూ ఏఁవీమాట్లాడకపోతే జర్మనుబాలే విశిష్టత దగ్గర్నుంచి జంగం బుల్లెమ్మ శీలంవరకూ తెలివిగా మాట్లాడగల నేర్పూ వున్నాయి. అంచేత ఏ కంపెనీలోనైనా అతను ఫైనవుతాడు. ఆడవాళ్ళు నలుగురూ ఏఁవీఁ మాట్లాడకపోవడం కనిపెట్టి సుబ్రమణ్యవేఁ చాలా విషయాలు మాట్లాడేడు. అతను యశోద కెదురుగా కూర్చోవడం వల్లనైతేనేమి, ఏదో విషయం మాట్లాడి "మీ రేఁవంటారు?" అని అన్నప్పుడు యశోదవేపు సూటిగా చూడ్డంవల్లం నైతేనేమి, ఆమే అతడి నెక్కువగా ఆకర్షించిందని ఆమెతో సహా అంతా ఫీలయ్యారు.

యీలోగా కన్నెపిల్ల మనసులోని కోర్కెలా నిండుగా లేచేడు చంద్రుడు.

పదిమంది నొక్కసారి ప్రేమించి, ఎవర్ని ఫైనల్‌గా ఎన్నుకోవడమో తెలియని కాలేజీపిల్ల మనసులా ఆరాటపడసాగింది సముద్రం.

చిరకాలానికి ప్రియుడ్ని చూడగలిగిన ప్రియురాలి హృదయంలా కొబ్బరిచెట్టాకులు టపటప కొట్టుకున్నాయి.

చుక్కలకళ్ళ దిష్టి తగలకుండా నన్నట్టు ఒక పల్చని మేఘం చంద్రుణ్ని కప్పేసింది. కాని అందులో నుంచే సందు చేసుకుని చూస్తున్నాడు చంద్రుడు.

సుబ్రమణ్యం మొహంమీద వెన్నెల పడకపోయినా అతని చూపుల్లతలు తనని చుట్టుకుంటున్నట్టు ఫీలయింది యశోధ. అతని చూపులు పెంపుడుకుక్క ప్రేమతో కరిచి నట్టు సూదిగానూ, అతిమెత్తగానూ ఉన్నాయి.

"మేమంతా సినీమాకి పోదామనుకున్నా మన్నయ్యా. నువ్వు కూడా రా రాదూ?" అని ఆహ్వానించింది సుందరం.

"అందులో హీరో ఏడవడంటే తప్పకుండా వస్తా" అన్నాడు సుబ్రమణ్యం నవ్వుతూ లేచి.

❖ ❖ ❖

సినిమా యింటర్వెల్లులో "యిందులో హీరోకి ఏడుపే కాదు విలన్కి పాటలుకూడా వుండేట్టున్నాయ్" అని అతనన్న మాటలకి మిగతావాళ్ళంతా గొల్లుమన్నారు. సినీమా తర్వాత హాస్టల్లుదగ్గర వాళ్ళని దింపేక "అన్నట్టు చెప్పడం మరచిపోయాను. నాకు కొద్దిరోజుల్లో ట్రాన్సఫరై పోవచ్చు" అన్నాడు సుబ్రమణ్యం.

"అప్పుడేనా?" ఆశ్చర్యపోయింది సుందరం.

"అంతా ఏవో పోలిటిక్సులే" సమాధానం చెప్పేడు.

"ఏ ఊరౌతుందో?" మళ్ళా సుందవేఁ ప్రశ్నించింది.

"ఉన్న ఊరొదిలేస్తే ఏ వూరైనా సరే యిస్తామంటున్నారు" క్షణం నిశ్శబ్దం.

ఏవూరు వేయించుకోమంటావ్?"

"ఏమో! నీ యిష్టం. మనూ రెలాగ యివ్వరుకదా! పోనీ వీళ్ళ వూళ్ళల్లో దేన్నైనా కోరుకో. ఈమెది కాకినాడ; ఈమెది విజయవాడ; ఈమెది ఏలూరు."

"ఏ వూరు వేయించుకుంటారు?" అన్న ప్రశ్న మూడు మనసుల్లో ఉవ్వెత్తున లేచి అలాగే అవ్యక్తంగా వుండిపోయింది.

❖ ❖ ❖

".....అన్నట్టు మీవూరే ట్రాన్స్ఫరైందిట. త్వరలో వచ్చి చార్జీ తీసుకుంటాడు. అతన్ని మీ యింటికి ఆహ్వానించమని సలహా యివ్వక్కర్లే దనుకుంటాను...." సుందరం రాసిన వుత్తరం అక్క డితో కొంతసేపు చదవడం మానేసింది యశోద. సుబ్రమణ్యం నిజంగా తనూరు కోరుకొనే వేయించుకొన్నాడా? ఐతే దేని కోసం? తన కోసమా? అసంభవం. తనలోవున్న ప్రత్యేక తేఁ విఁటి? కాని మొదట చూసినప్పుడే తనని ప్రత్యేకించి గుర్తిం చాడే? ఎంచేత? ఏవిటి తన ఆధిక్యత? తనకంటె అరుణా, శారదా అందంలో గాని, చదువులోగాని, డబ్బులోగాని ఏమాత్రం తీసిపోరు. డబ్బు గురించి, చదువుగురించి సుబ్ర మణ్యానికి తెలియక పోవచ్చు. కాని ఏమిచూసి తనని ఎన్ను కొన్నాడతను? జవాబు తెలుసుకోడానికి తహతహలాడింది. ఆమె క్యూరియా సిటీ పూర్తిగా రౌజ్ అయింది.

ఇంగ్లీషు సినిమాలో హఠాత్తుగా హీరోయిన్ని చెంప దెబ్బకొట్టి హీరో ముద్దుపెట్టుకున్నట్టు అకస్మాత్తుగా యశోదా సుబ్రమణ్యాల పెళ్ళి నిశ్చయమైపోయింది.

"హార్టీ కంగ్రాట్యులేషన్స్..... యింతకీ నే నోటి అడుగుతా చెప్తావూ? నిన్ను చూసినదగ్గర్నుంచీ నీ కొంగేపట్టుకు ఎందుకు తిరుగుతున్నాడమ్మా నిక్కాబోయే ఆయన" ధారాళంగా అడ ిగేసింది యశోదని శారద, పెళ్ళికి వచ్చినప్పుడు.

"ఏమో నాకుతెలీదు" ముద్దబంతి జవాబు చెప్పింది యశోద.

"ఆమాత్రం అడక్కుండా వుంటావా? పోన్లేమ్మా మాకు చెప్ప క్కర్లేదులే" అరుణ సంభాషణ తుంచేసింది.

పెళ్ళి దివ్యంగా జరిగిపోయింది. పన్నెండు హనీమూన్లులా తిరిగిపోయింది సంవత్సరం. యశోదకి కలిగిన ప్రతి కోరికా తీర్చాడు సుబ్రమణ్యం.

ఇంద్రధనస్సు వలచి చీరెలు చింపించే డామెకి.

ఉదయారుణ కాంతిలో గడ్డిపోచ చివర మెరిసే వజ్రాన్ని తాపించి ఉంగరము చేయించేడు.

పన్నీటి సరస్సులో గులాబీరేకుల్లో బోటుషికార్లు తిప్పేడు.

తెల్ల మేఘాల పరువులు కుట్టించేడు.

ఇవన్నీ చాలవేమోనని

నెలకో బెనారసుచీర కొన్నాడు.

అసలు వజ్రాల ఉంగరాలు కొన్నాడు.

గులాబీబోటు కాకపోయినా, ఆమె పెదాలంత ఎర్రగా వున్న కారుకొన్నాడు.

ఇన్నున్నా ఆమె ఏదో కొరత ఫీలౌతూ వుండేది. దాని క్కారణం ఆమెని మొదట్నుంచీ వేధిస్తున్న ప్రశ్న. ఇంత వరకూ ఆమె సిగ్గు, సుబ్రమణ్యాన్ని ఆ ప్రశ్న వెయ్యనివ్వ లేదు.

ఆనాడు వారి పెళ్ళయి సమంగా సంవత్సరం. నేడన్నా ఆ ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలి.

ఆవేళ అడిగేసింది– "నేనొకటి అడుగుతా చెప్తారూ."

"ఓ!"

"మీరు మొదట్నించీ నన్ను...."

"ప్రేమించేను. లవెట్ ఫస్ట్ నైట్."

"అదికాదండి...."

"నేనిదివర కెవర్నైనా ప్రేమించే నా? నీ తోడు."

"మీతో సాగలేం..."

"మీ అమ్మతోడు"

"బాబ్బాబు! ఒక్కక్షణం మాట్లాడనీయండి."

".........."

'మీరు నన్ను మొదట్నించి అందర్లాగా చూళ్ళేదు కదా?"

"నిన్నంతా ఎలా చూస్తారో తెలీదుకాని, నేను చూసినట్లు చూస్తే మాత్రం చంపేస్తాను."

"నన్ను...."

"నిన్ను కాదు. 'అంతాని"

"అదికాదండీ.....అంటే.... ఐ మీన్... మమ్మల్ని మొదట మీరు చూసినప్పుడే నన్ను ప్రత్యేకంగా.... అంటే మిగతా వాళ్ళ ద్దర్నీ చూసినట్లు కాకుండా.... స్పెషల్లా చూశారు కదూ?"

"నేరం ఒప్పుకుంటున్నాడు ముద్దాయి"

"ఎంచేత?"

"ఖూనీ ఒప్పుకున్న వాడ్ని ఉరితీసి పంపించేస్తారుకాని కారణాలడగరు?"

"అది కాదండీ! సరదా కదుగుతున్నా."

"............"

"అప్పుడు నాలో ఏది మిమ్మల్ని ఆకర్షించింది?"

".................."

"చెప్పండీ" బతిమాలింది.

".............."

"బాబ్బాబూ" బుజ్జగించింది"

"నీ నల్లంచు తెల్లచీర...."

**(యువ, 1.4.1966)**

# చీకటి చీలింది

"**వ**ట్టి రూల్సుమనిషి. రూల్సుతో రూళ్ళ కర్రతో కొట్టినట్టు మమ్మల్ని కొడతాడు" అంటారు డాక్టరు సుబ్రమణ్యం గురించి అతని స్టేఫ్. అతను చార్జీ తీసుకోగానే వాళ్ళని ఉదయం డ్యూటీకి 8 గంటలకు రమ్మన్నప్పుడతన్ని చెప్పుతో కొట్టాలనిపించింది వారికి.

వాళ్ళను రమ్మండవే కాకుండా, అతను 8 గంటలకు ముందే వచ్చి నిన్నటి మిగిలిపోయిన శవంలా ఆస్పత్రిలో కూర్చోవడం చూస్తే, అతన్ని చెట్టుక్కట్టి మరీ చెప్పుతో కొట్టాలనిపించింది వారికి.

సుబ్రమణ్యం వట్టి రూల్సుమనిషి. పేషెంట్లు హక్కులకు సంబంధించిన రూల్సంటే సూక్తుల్లా చూసుకుంటాడు. అంచేత "చల్లన్చేయ్యి" అని అతని పేషెంట్లు మెచ్చుకునే అతని చెయ్యిని "ఏం అస్తంరా బాబూ. బస్మాసురస్తం" అని తిట్టేరు అతని స్టేఫ్. అంతే కాకుండా "గడ్డి వామిదగ్గర కుక్కలాటోడు. ఆడుతిన్డు, మరోడ్ని తిన్నివ్వడు. ఇలా టోళ్ళు మరో పదిమందివుంటే దేశం నాశనవేఁ" అని దేశభవిష్యత్తును గురించి విచారించేరు.

అందరికంటే ఎక్కువ విచారించింది, మంత్రసాని సుబ్బమ్మ. సుబ్రమణ్యం ఆమెని ఆస్పత్రికి వచ్చినప్పుడు తెల్లచీర కట్టుకోక తప్పదన్నప్పుడు, ఆమె ఆస్పత్రికి తెల్లచీర విప్పేసుకు వస్తానన్లే దెప్పుడూ, బ్లూ చీరెలు కట్టుకుంటానంది. "ఫోనీ ఎర్రచీరన్నాసరే" అంది. ఆమెకు తన సేటీన్ చూపుల్లాటి బ్లౌజులూ, తన టఫెటా మాటల్లాటి చీరెలూ ఆస్పత్రిలోనూ, బైటకూడా కట్టుకోడం అల వాటు. పాతడాక్టరు "పరమ ప్రెబువు"న్నన్నాళ్ళూ వారానికో కొత్తచీర కొనుక్కోడం అలవాటు ఈ "వామిదగ్గర కుక్కగాడొచ్చేక ఆమె రామీ పూర్తిగా పడిపోయింది. పోనీ పాతరంగు చీర్లన్నా కట్టుకోనివ్వడు "ఎదవ మొకవాఁని, ఎదవ మొకం" (అని తిట్టు కుందామె)

సుబ్రమణ్యం అజ్ఞ ప్రకారం ఆమె తన కొండంత జుట్టు ముడితో పువ్వుల్లేకుండా, అంచులేని తెల్లచీర కట్టుకొని ఆస్పత్రికి వెళ్ళినప్పుడు చెట్టంత సమితి ప్రెసిడెంటు బతికుండగానే ముండ మోసినట్టనిపించిందామెకు. ముసలి మీరాలా–ఆఖరి సీన్లో చింతా మణ్లా– కనిపించిందామె ప్రెసిడెంటుకి. ఇంకా హీనంగా చచ్చి పోయిన వెధమ్ముండ శవంలా కనిపించింది ఆమె మట్టు కామె.

సుబ్రమణ్యం ఛార్జీతీసుకున్న మర్నాడే సుబ్బమ్మని సమితి ప్రెసిడెంటుతో మితిమీరి మాటాడొద్దంటే, మితిమీరి కోపం వచ్చింది ప్రెసిడెంటుకి. అంతకంటే ఎక్కువే వచ్చింది సుబ్బమ్మకి. కోపంతో వణికిపోయింది సుబ్బమ్మ.

సుబ్రమణ్యం ఛార్జీతీసుకున్నాక నర్సులు పువ్వులెరగరు. సుబ్బమ్మ డబ్బెరగదు. తోటివాళ్ళు సారా ఎరగరు. పేషెంట్లు కష్టమెరగరు. సుబ్రమణ్యం సుఖవెఁరగడు. గొడ్డులా చాకిరి చెయ్య దవేఁ సుబ్రమణ్యం పని. "ఓ సర్దానా? ఓ సుకఁవా?" అన్నది మరచి పనిచేశాడు. అతనలా పన్చేసి వూరుకుంటే అతని స్టేపు కేం అభ్యంతరం లేదు. వాళ్ళనికూడా అలా పన్చెయ్యమంటే మాత్రం వాళ్ళ కెక్కళ్ళేని అభ్యంతరం వుంది. "ఆడికేం! ఐదొం దలొచ్చి ఒళ్ళోపడ్తాయ్ నెలయ్యేసరికి. మనలా టోళ్ళ సంగ తేమిటి?" అని వాళ్ళని వాళ్ళే ప్రశ్నించుకున్నారు. డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నవాడి శవాన్ని కూడా వాళ్ళవాళ్ళకి మామూళ్ళు పుచ్చుకోందే అప్పచెప్పడం అలవాట్లేదు వాళ్ళకి.

వారం తిరక్కుండానే ఆస్పత్రిస్టేఫ్ ప్రెడిడెంటు దగ్గరికి డెప్యుటేషన్ వెళ్ళేరు. సుబ్రమణ్యం తమని పెట్టే బాధలు లేని వివరాలతో చెప్పుకున్నారు. "అతగోడు డాక్టరేటి? ఇరణ్యకసిడు. ఇనపగుండెల మడిసి. ఇలాటోళ్ళు మరో పదిమందిరుంటే దేశం బావుపణ్ణట్టే!" అని దేశభక్తి వలకపోశారు.

ఆ ముందు రాత్రే సుబ్బమ్మ ప్రెసిడెంటుతో సుబ్రమణ్యం గురించి (మంచి మినహా) అంతా చెప్పేసింది. ఐదు నిమిషాలు –" కేవలం ముష్టయిదు నిమిషాలు" ఆలస్యంగా వచ్చిన